క్లుప్తంగా

ఆదర్శ డిపోగా పేరు తేవాలి

మదనపల్లె సిటీ : ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి ఆదర్శ డిపోగా పేరు తీసుకురావాలని ఆర్టీసీ-1 డీఎం మూరే వెంకటరమణారెడ్డి అన్నారు. శనివారం స్థానిక డిపోలో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ నిర్వహించారు. ఈపీకెఓ, ఓఆర్, కెఎంపిఎల్‌లో రీజియన్‌లో డిపో మొదటి స్థానం నిలిచిందన్నారు. అందరూ కలిసి పని చేసి మరింత ఆదాయం తీసుకురావాలన్నారు. ఫిబ్రవరి నెలలో అత్యధిక కెఎంపిఎల్ తెచ్చిన డ్రైవర్ పవన్‌కుమార్, టార్గెట్ ఆదాయం, ఈపీకెఓ అత్యధికంగా తెచ్చిన కండక్టర్లు, డ్రైవర్లకు నగదు బహుమతి, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఇటీవల శివరాత్రి స్పెషల్ బస్సుల్లో అత్యధికంగా తెచ్చిన సిబ్బందిని అభినందించారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం



మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

బి.కొత్తకోట : పరిసరాల శుభ్రతతో ఆరోగ్యంగా ఉండొచ్చని నగర పంచాయతీ కమిషనర్ జీవీ పల్లవి అన్నారు. శనివారం పట్టణంలోని ప్రధాన మార్గాల్లో వివిధ సంఘాల ప్రతినిధులు, నగర పంచాయతీ సిబ్బంది ర్యాలీ నిర్వహించి జ్యోతిచౌక్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయ ఆవరణలో ఎంఈవోలు రెడ్డిశేఖర్, భీమేశ్వరాచారి, సిబ్బంది చెత్తను తొలగించి స్వచ్ఛంద్ర కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని గ్రామపంచాయతీల్లో ఎంపీడీఓ దిలీప్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల సిబ్బంది ర్యాలీలు నిర్వహించి స్థానికుల్లో అవగాహన కల్పించారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరం

మదనపల్లె సిటీ : వినియోగదారులు తమ హక్కుల గురించి తెలుసుకోవాలని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని చంద్రమాకులపల్లెలో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం నిర్వహించారు. వినియోగదారుల హక్కులను పరిరక్షించడంలో వినియోగదారుల అవగాహన, విద్య ప్రాముఖ్యతను తెలియజేశారు. వస్తువులను కొనే సమయంలో బిల్లులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. వినియోగదారుల హక్కుల గురించి అవగాహన కల్పించడానికి వీధి నాటకాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ సతీష్‌బాబు, ప్రొఫెసర్లు మహమ్మద్‌షఫీ తదితరులు పాల్గొన్నారు.

మసీదులకు వితరణ

కలికిరి : మండలంలోని కె.రెడ్డివారిపల్లి గ్రామం అండేకురవపల్లికి చెందిన శిబ్బాల దినకర్ రంజాన్ మాసం సందర్భంగా మసీదుల నిర్వహణకు గాను రూ.1.10 లక్షలు రూపాయలు వితరణ చేశారు. కలికిరి గ్రామ పంచాయతీ పరిధిలోని తొమ్మిది మసీదులకు తన వంతు సహాయంగా వితరణ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు శనివారం కలికిరి పెద్ద మసీదు ముస్లిం మత పెద్దలకు నగదును అందజేసి రంజాన్ పర్వదినాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

మేధో సంపత్తి హక్కులపై అవగాహన



మాట్లాడుతున్న అశోక్ దొప్పలపూడి

కురబలకోట : విద్యార్థులు, అధ్యాపకులు, ఔత్సాహిక వ్యవస్థాపకులు మేధో సంపత్తి హక్కులపై అవగాహన పెంచుకోవాలని హైదరాబాద్ ఐపీఆర్ ట్రైబ్ డైరెక్టర్ అశోక్ దొప్పల పూడి కోరారు. మేధో సంపత్తి హక్కులపై శనివారం అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మనిషి జీవితం మెరుగుపడటంతో మేధో సంపత్తి హక్కులకు ప్రాధాన్యత ఏర్పడిందన్నారు. పేటెంట్లు, కాపీ రైట్లు, ట్రేడ్ మార్క్‌ల ముఖ్య అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రపంచంలో చాలా దేశాలు చట్టాలలో మేధో సంపత్తి హక్కులను చేర్చారన్నారు. పేటెంట్ ఉత్పత్తి పరిశోధన బలమన్నారు. ఉత్పత్తులకు ఆవిష్కర్తలు పేటెంట్ హక్కులు పొందడం ద్వారా ఆదాయం లభిస్తుందన్నారు. వీటిని అధికారికంగా నమోదు చేసుకోవడం ద్వారా ప్రపంచ వ్యాప్తంగా మేధో సంపత్తి హక్కులు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నోటమాట రావడం లేదు!

- రైతు కంట కన్నీరు
- ధరలు భారీగా పతనం
- పెట్టుబడి కూడా దక్కని వైనం
- అప్పుల పాలైన అన్నదాత



కాయలు కోయకుండా పొలాల్లో వదిలేసిన టమాటా పంట

పెద్దతిప్పసముద్రం : తంబళ్లపల్లె నియోజకవర్గంలో టమాటా పంట సాగు చేసిన రైతుల నోట మాట రాక మూగబోయింది. పంట ఆరంభం నుంచి కోత దశ వరకు అష్ట కష్టాలు పడి సాగు చేసినా.. ఇటు తెగుళ్లు, అటు నిలకడ లేని ధరల కారణంగా పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయారు. ఆఖరికి పంటపై ధారపోసిన పెట్టుబడి సొమ్ము కూడా చేతికందక పోవడంతో ఏం చేయాలో దిక్కు తోచక సతమతమవుతున్నారు. పంట సాగు కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలి భగవంతుడా అంటూ బోరున విలపిస్తున్నారు. మార్కెట్‌లో టమాటా ధరలు ఒక్కసారిగా పతనం కావడం, ప్రస్తుతం మార్కెట్‌లో కిలో టమాటా 10 రూపాయల లోపే పలకడంతో కూలీల ఖర్చు, రవాణా చార్జీలకు కూడా అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం పెట్టుబడి కూడా చేతికందే పరిస్థితి లేకపోవడంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారిపోయింది. గత నెల రోజులుగా టమాటా ధరలు గణనీయంగా తగ్గిపోవడంతో రవాణా చార్జీలు దండగని భావించి కాయలను కోయకుండా పొలాల్లోనే వదిలేయాల్సిన దుస్థితి దాపురించింది. ఆరుగాలం కష్టపడినా పంట చేతికొచ్చే సమయానికి దిగుబడిని చూసి రైతులు మురిసిపోయారే గానీ ధరలు పతనం కావడంతో రైతులు నష్టాలను చవి చూడాల్సి వస్తోంది.

నాలుగు వేల ఎకరాల్లో సాగు

తంబళ్లపల్లె నియోజకవర్గంలో రైతులు నాలుగు వేల ఎకరాలకు పైగా టమాటా పంటను సాగు చేసినట్లు ఉద్యాన శాఖ అధికారుల అంచనా. ఒక ఎకరా పంట సాగు చేయాలంటే రూ.1.50 లక్షలకు పైగా ఖర్చు వస్తుంది. ఒక వైపు తెగుళ్లు, మరో వైపు వేసవి కారణంగా వ్యవసాయ బోర్లలో అడుగంటుతున్న జలాలు.. ఇన్ని కష్టాలను సైతం అధిగమించినా పంట చేతికొచ్చే సమయానికి ధరలు పడిపోవడంతో అన్నదాతలు కంటతడి పెడుతున్నారు. మరి కొందరైతే ధరల్లేవని నిర్ధారించుకుని కాయలు కోయకుండా పొలాల్లోనే వదిలేయాల్సిన దుస్థితి నెలకొంది. పరిస్థితి ఇలాగే ఉంటే ఆత్మహత్యలే శరణ్యమని పలువురు రైతులు దిగాలు చెందుతున్నారు. నిలకడ లేని ధరల కారణంగా పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయి నష్టపోయిన టమాటా రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

తెలుగు యువత బలోపేతానికి కృషి

- రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు
- ఘనంగా జన్మదిన వేడుకలు



శ్రీరామ్ చిన్నబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు

మదనపల్లె : తెలుగు యువత బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానని రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు, మదనపల్లె టీడీపీ నాయకుడు శ్రీరామ్ చినబాబు తెలిపారు. ఆయన జన్మదిన వేడుకలు శనివారం నీరుగట్టువారిపల్లెలోని తన స్వగృహంలో ఘనంగా జరిగాయి. మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్, టీడీపీ సీనియర్ నాయకులు రాటకొండ బాబురెడ్డి, జనసేన పార్టీ రాయలసీమ కో కన్వీనర్ గంగారపు రాందాస్ చౌదరి ముఖ్య అతిథులుగా హాజరై కేక్ కటింగ్ అనంతరం శుభాకాంక్షలు తెలిపారు. పుంగనూరు, పీలేరు, తంబళ్లపల్లె, రాయచోటి నియోజకవర్గాల నుంచి పెద్ద సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు వచ్చి శుభాకాంక్షలు తెలిపారు. గజమాలతో సత్కరించారు. జన్మదినం సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్టీ కష్ట కాలంలో శ్రీరామ్ చినబాబు చేసిన సేవలను కొనియాడారు. యువతలో స్ఫూర్తి నింపారన్నారు. ఈ సందర్భంగా శ్రీరామ్ చిన్నబాబు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షులుగా నియమించి పార్టీకి సేవ చేసే అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు కతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దొరస్వామి నాయుడు, ఆర్జే వెంకటేష్, తెలుగు యువత నాయకులు విష్ణు, బాబీ, అరుణ్ నాదెండ్ల, మహబూబ్ ఖాన్, ప్రణయ్, మోడెం శివ కుమార్, గంగారపు బాబు రెడ్డి, టి కే ఎన్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు



సామాజిక తనిఖీ బహిరంగ సమావేశంలో మాట్లాడుతున్న పీడీ వెంకటరత్నం

కలికిరి : మండలంలో జరిగిన 18వ సామాజిక తనిఖీ బహిరంగ సమావేశంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకంలో జరిగిన 1399 పనులకు గానీ పలు అవకతవకలకు సంబంధించి రూ.3.36 లక్షల రికవరీకి డ్వామా పీడీ వెంకటరత్నం ఆదేశించారు. స్థానిక ఎంఆర్సీ కార్యాలయ ఆవరణలో శనివారం జరిగిన సామాజిక తనిఖీ బహిరంగ సమావేశంలో తనిఖీ సిబ్బంది గ్రామాల వారీగా జరిగిన పనులు, కూలీలు, ఖర్చుల వివరాలను చదివి వినిపించారు. పలు పనులలో అవతవకలను గుర్తించినట్లు నివేదికలో వెల్లడించారు. ఈ మేరకు నివేదికలను పరిశీలించిన పీడీ వెంకటరత్నం సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్‌లను విచారణ చేసి, సంతృప్తికర సమాధానం లేకపోవడంతో రికవరీకి ఆదేశాలు జారీ చేశారు. మండలంలో 1399 పనులను రూ.7,84,32,787లతో చేపట్టారు. గ్రామాల వారీగా మేడికుర్తి రూ.1,08,429, చీకటిపల్లి రూ.1,04,891, పత్తేగడ రూ.39,971, మునెళ్ళపల్లి రూ.20,813, పల్లవోలు రూ.12,856, మహల్ రూ.14,474, గుండ్లూరు రూ.18,206, అద్దవారిపల్లి రూ.4107, టి.సంగ్రావారిపల్లి రూ.3732, గుట్టపాళె రూ.3663, మర్రికుంటపల్లి రూ.1000, కలికిరి రూ.771, మొత్తం రూ.3,35,935 రికవరీ చేయాలని ఎంపీడీఓను ఆదేశించారు. కూలీలకు అడిగిన మేరకు పనులు కల్పించాలని, పనుల కల్పనలో అలసత్వం వహించిన వారిపై చర్యలు తప్పవని పీడీ అన్నారు. కార్యక్రమంలో ఏపీడీ శ్రీనివాసులు, ఎంపీడీఓ భానుమూర్తిరావు, ఏపీఓ సుజాత, ఎస్ఆర్‌పీ మురాద్, డీఆర్‌పీలు పాల్గొన్నారు.

ఇసుక అధిక ధరకు అమ్మితే చర్యలు



టిప్పర్ అసోసియేషన్ సభ్యుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ కొండయ్య నాయుడు

మదనపల్లె : స్వప్రయోజనాల కోసం ఇసుక కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ కొండయ్య నాయుడు హెచ్చరించారు. శనివారం సాయంత్రం టూ టౌన్ సర్కిల్ కార్యాలయంలో టిప్పర్ అసోసియేషన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. వారికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ అందరూ కలసికట్టుగా ఉంటూ లబ్ధిదారులకు తక్కువ ధరకు ఇసుక అందించాలన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే పోలీసులను ఆశ్రయిస్తే తాము అండగా ఉంటామన్నారు. బ్రోకర్ వ్యవస్థ లేకుంటే తాము కూడా తక్కువ ధరలకు ఇసుక అందిస్తామని టిప్పర్ యజమానులు తెలిపగా, సబ్ కలెక్టర్‌తో చర్చించి సమస్య పరిష్కరిస్తామన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే టిప్పర్లను అడ్డుకోవడం గానీ, బెదిరించడం గానీ చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. అసోసియేషన్‌లో సమస్యలు పరిష్కరించుకోవాలి గానీ, ఇతరులపై దాడులకు తెగబడితే ఉపేక్షించేది లేదన్నారు. ఈ సమావేశంలో టూ టౌన్ సీఐ రామచంద్ర, టిప్పర్ అసోసియేషన్ నాయకులు ప్రసాద్ రెడ్డి, శివరాయల్, బావాజాన్, భరత్, సి.రమేష్, శ్రీనివాసులు, అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

కలికిరి : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్-2025 ప్రవేశ పరీక్షకు అనుభవం కలిగిన అధ్యాపకులచే ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాసులు తెలిపారు. శిక్షణకు హాజరయ్యే అభ్యర్థులకు ఉచిత స్టడీ మెటీరియల్‌తోపాటు మోడల్ పరీక్ష నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఏప్రిల్ 1 నుంచి 25 వరకు ఉచిత శిక్షణ ఉంటుందని, పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 10వ తరగతి హాల్‌టికెట్టు, పాస్‌పోర్ట్ సైజు ఫొటో, ఆధార్, మొబైల్‌తో కళాశాలలోని హెల్ప్‌లైన్ కేంద్రంలో సంప్రదించి, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.100, బీసీ, ఓసీ అభ్యర్థులు రూ.400 దరఖాస్తు ఫీజు చెల్లించవచ్చన్నారు. ఏప్రిల్ 30న కలికిరిలో నాలుగు కేంద్రాలలో పాలిసెట్ ప్రవేశ పరీక్ష జరుగుతుందని తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

పెద్దమండ్యం : ఎక్కడైనా తాగునీటి సమస్య ఉన్నట్లు తమ దృష్టికి తెస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చంద్రశేఖరరెడ్డి అన్నారు. మండలంలోని సీ గొల్లపల్లె, పెద్దమండ్యం గ్రామాలలో తాగునీటి పథకాల బోర్లను ఆయన శనివారం పరిశీలించారు. పెద్దమండ్యం శివాలయం వద్ద తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి చొరవతో జెడ్పీ నిధులతో ఏర్పాటు చేసిన మోటారును పరిశీలించారు. గ్రామంలో తాగునీటి సరఫరాపై ఆరా తీశారు. సీ గొల్లపల్లెలో ఏర్పాటు చేసిన తాగునీటి బోరులో నీటిమట్టం తగ్గిపోయి సక్రమంగా నీరు రావడం లేదని వైస్ ఎంపీపీ జి. శారదమ్మ డీఈ దృష్టికి తెచ్చారు. తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని డీఈ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ అశోక్‌కుమార్, సర్పంచ్ బాషా పాల్గొన్నారు.

నేటి నుంచి మహాభారత జ్ఞానయజ్ఞం

పీలేరు రూరల్ : స్థానిక ఆర్యవైశ్య కల్యాణమండపంలో ఆదివారం నుంచి ఈ నెల 22వ తేదీ వరకు చిన్నయమిషన్ ఆధ్వర్యంలో మహాభారత జ్ఞాన యజ్ఞం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 8 నుంచి 9 గంటల వరకు కైవల్యోపనిషత్తుపై, సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 వరకు శాంతిపర్వం అంశంపై ఢిల్లీకి చెందిన చిన్నయమిషన్‌స్వామి చిద్రూపానంద ఆధ్యాత్మిక ఉపన్యాసాలు చేస్తారని తెలిపారు. ఉదయం, సాయంత్రం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

జూదరుల అరెస్టు

నిమ్మనపల్లె : నలుగురు జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. శనివారం మండలంలోని సామకోటవారిపల్లె సమీపంలో జూదం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. ఈ దాడిలో జూదం ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.3,420 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

అమెరికన్ వర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్



సి.రఘునాథరెడ్డి

కురబలకోట : అమెరికా సెంట్రల్ యూనివర్సిటీ అంగళ్లులోని విశ్వం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సి రఘునాథరెడ్డికి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. పెద్దమండ్యం మండలం వెలిగల్లులో రైతు కుటుంబానికి చెందిన ఆయన ఎంఏ వరకు విద్యనభ్యసించారు. బోధన వృత్తిపై ఉన్న మక్కువ గౌరవంతో తొలుత తంబళ్లపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అతిథి అధ్యాపకులుగా పని చేశారు. తర్వాత 2007లో విశ్వం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టి యాజమాన్యంతో కలసి కళాశాల అభివృద్ధి, విద్యాభివృద్ధికి నిర్విరామంగా కృషి చేశారు. అంతే గాకుండా గ్రామీణ ప్రాంత విద్యార్థుల భవిష్యత్తు కోసం కళాశాలలో ప్రత్యేకంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఇందుకు గాను వివిధ సంస్థల నుంచి 30 దాకా ప్రశంసా పత్రాలతోపాటు వివిధ అవార్డులు అందుకున్నారు. ఈయన సేవలను గుర్తించి డాక్టర్ సర్వేపల్లె రాధాకృష్ణన్ టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గౌరవ డాక్టరేట్‌కై అమెరికన్ సెంట్రల్ యూనివర్సిటీకి సిఫారసు చేశారు. రఘునాథరెడ్డి విస్తృత సేవా కార్యక్రమాలను గుర్తించిన అమెరికన్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఆయన చేసిన విద్య, సామాజిక సేవా కార్యక్రమాలకు గాను ఈ గౌరవ డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా విశ్వం విద్యా సంస్థల అధినేత విశ్వం ప్రభాకర్‌రెడ్డితో పాటు సహ అధ్యాపకులు శనివారం జరిగిన అభినందన సభలో రఘునాథరెడ్డిని ఘనంగా సత్కరించి ప్రశంసించారు.

నేత పుట్టిన రోజున సేవా కార్యక్రమాలు



అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కలికిరి(వాల్మీకిపురం) : పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తనయుడు, నియోజకవర్గ యువత నేత చింతల సాయిక్రిష్టారెడ్డి జన్మదిన వేడుకలను శనివారం వాల్మీకిపురంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సాయి నారాయణ సేవా ట్రస్టు కార్యాలయంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. నారాయణ సేవ ట్రస్టు కేంద్రంతోపాటు గాంధీ సర్కిల్‌లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. యువనేత రాజకీయాలలో ఉన్నత స్థానానికి ఎదగాలని ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు ఆకాంక్షించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతల శివానందరెడ్డి, బీసీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు నీళ్ల భాస్కర్, టెలికాం కమిటీ సభ్యుడు శ్రీధర్‌రాయల్, వాల్మీకిపురం ఉప సర్పంచ్ బిడ్డల కేశవరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ పులి శివకుమార్‌రెడ్డి, జగదీష్, యూసుఫ్, ఇర్ఫాన్, ఉదయ్, గణేష్, రెడ్డీ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలి



నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్‌అహ్మద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్.ఎ.కరీముల్లా

మదనపల్లె సిటీ : వైఎస్సార్‌సీపీకి పూర్వ వైభవం తెచ్చేందుకు, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్ అహ్మద్ అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో రాష్ట్ర మైనార్టీ కార్యదర్శిగా నియమితులైన ఎస్.ఎ.కరీముల్లా శనివారం నియోజకవర్గ సమన్వయకర్తను కలుసుకుని పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా నిస్సార్‌అహ్మద్ మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఇంటింటికీ తీసుకెళ్లాలన్నారు. రానున్న ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్‌సీపీని గెలిపించుకుని సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని చేసుకోవాలన్నారు. తనపై ఎంతో నమ్మకంతో పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని కరీముల్లా తెలిపారు. తనకు పదవి వచ్చేందుకు సహకరించిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, నిస్సార్‌అహ్మద్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లికార్జునరెడ్డి, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా కనుమలో గంగమ్మ జాతర



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

మదనపల్లె సిటీ : మదనపల్లె మండలం పుంగనూరు రోడ్డులో వెలసిన శ్రీ కనుమలో గంగమ్మ జాతర శనివారం అత్యంత వైభవంగా జరిగింది. అఖండల దీపం పూజతో జాతర ప్రారంభమైంది. జాతర పురస్కరించుకుని అమ్మవారి ఆలయాన్ని రంగు రంగు విద్యుత్‌దీపాలతో అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తుల కోసం క్యూలైన్లు ఏర్పాటు చేశారు. మహిళలు అమ్మవారికి దీలు, బోనాలు సమర్పించారు. ఆలయం ఎదుట నిమ్మకాయలతో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. మదనపల్లె మండలం బసినికొండ, రామాచార్లపల్లె, వలసపల్లె, డ్రైవర్స్ కాలనీ ప్రాంతాల ప్రజలు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకున్నారు. ఆదివారం పగలు తిరునాల జరుగుతుందని దేవదాయ శాఖ ఈఓ రమణ తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు శీతక యుగంధర్, కత్తి లక్ష్మన్న, నటశేఖర, గుట్ట రమణ, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు సర్వం సిద్ధం



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పీలేరు రూరల్ : రేపటి నుంచి జరుగనున్న పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు ఎంఈవో పి.లోకేశ్వర్‌రెడ్డి, వి.పద్మావతి అన్నారు. శనివారం పట్టణంలోని జెడ్పీ మెయిన్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కోటపల్లె బాలురు, బాలికల జెడ్పీ ఉన్నత పాఠశాలలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో తొమ్మిది పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సురేంద్రనాథ రెడ్డి, ఉపాధ్యాయులు పోతంశెట్టి రమేష్ పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రం : ఈ నెల 17 నుంచి ఏప్రల్ నెల 1 వరకు పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు జరుగుతాయని ఎంఈఓ నారాయణ పేర్కొన్నారు. స్థానికంగా ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో జరిగే ఈ పరీక్షలకు మొత్తం 263 మంది విద్యార్థులు హాజరౌతారన్నారు. మోడల్ స్కూల్‌లో పరీక్షా కేంద్రం చీఫ్ సరస్వతి విద్యార్థులకు మౌలిక వసతులు సమకూర్చినట్లు ఎంఈఓ వెల్లడించారు.

ఘనంగా కాన్షీరాం జయంతి



మదనపల్లె సిటీ : రక్తదానం చేస్తున్న బీఎస్‌పీ నాయకులు



పీలేరు రూరల్ : కాన్షిరామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బాస్ నాయకులు.

మదనపల్లె సిటీ : మదనపల్లెలో శనివారం బహుజన్ సమాజ్ పార్టీ నిర్మాత కాన్షిరామ్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. వివిధ సంఘాల ఆధ్వర్యంలో వేర్వేరుగా వేడుకలు నిర్వహించారు. స్థానిక సొసైటీ కాలనీలోని బాస్ కార్యాలయంలో కాన్షిరామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బాస్ వ్యవస్థాపకులు పీటీఎం శివప్రసాద్ మాట్లాడతూ అంబేడ్కర్ కలల పంట కాన్షిరామ్ అన్నారు. ఆయన బాటలో నడవాలని కోరారు. కార్యక్రమంలో బాస్ నాయకులు ముత్యాల మోహన్, నీరుగట్టు రమణ, పీర్‌బాషా, రెడ్డిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు సర్కిల్‌లో బహుజన్ యువసేన ఆధ్వర్యంలో కాన్షిరామ్ జయంతి వేడుకలు జరిగాయి. బీవైఎస్ రాష్ట్ర అధ్యక్షులు పునీత్ మాట్లాడుతూ బహుజన సమాజాన్ని నిర్మిద్దాం అంటూ ఉద్యమాలు చేస్తూ చివరికి బహుజనులకు రాజ్యాధికారం అందించిన గొప్ప వ్యక్తి అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆది, జగదీష్, ద్వారక, శశికుమార్ తదితరులు పాల్గొన్నారు. బీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షులు బందెల గౌతమ్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా ఆస్పత్రిలో రక్తదానం, రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఎస్‌పీ నాయకులు రమణ, శివ, ప్రసాద్, గణి, ఫణి తదితరులు పాల్గొన్నారు. స్థానిక బహుజన సేన ఆధ్వర్యంలో కాన్షిరామ్ జయంతి వేడుకలు జరిగాయి. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బహుజన సేవ రాష్ట్ర అధ్యక్షులు శ్రీచందు, నాయకులు మనోహర్‌రెడ్డి,రూపక్‌నాయక్, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పీలేరు రూరల్ : బహుజనరాజ్య పితామహుడు కాన్షిరామ్ 91వ జయంతిని ఘనంగా నిర్వహించారు. శనివారం స్థానిక భారతీయ అంబేడ్కర్ సేన (బాస్) కార్యాలయంలో కాన్షిరామ్ చిత్రపటానికి పూల మాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాలకుంట శ్రీనివాసులు మాట్లాడుతూ తర తరాలుగా బహుజనులను అణచివేస్తున్న కుల వివక్షతను ఎదురించి బహుజన వర్గాలను రాజ్యాధికారం వైపు నడిపించిన మహా నేత కాన్షిరామ్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బాస్ నాయకులు కృష్ణయ్య, హరినాథ, గురవయ్య, రామకృష్ణ, హరీష్, కిషోర్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ ఉత్పత్తుల విక్రయాలు నిలిపివేయాలి



కలకడ : ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు



మదనపల్లె సిటీ : ర్యాలీ నిర్వహిస్తున్న మెప్మా సిబ్బంది

మదనపల్లె సిటీ : ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ కోసం పట్టణంలో ప్లాస్టిక్ వినియోగం పూర్తిగా నిషేధిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని మున్సిపల్ కమిషనర్ ప్రమీల అన్నారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ మదనపల్లె కార్యక్రమంలో భాగంగా విక్రయదారులకు అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. మున్సిపాలిటీలో ప్లాస్టిక్‌ను సంపూర్ణంగా నిషేధించాలని నిర్ణయించామన్నారు. పర్యావరణానికి హానికరమైన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల తయారీ, దిగుమతి నిల్వ, పంపిణీ, అమ్మకం, వినియోగాన్ని నిషేధించామన్నారు. కార్యక్రమంలో డీఈ శ్రావణి, మెప్మా సీఎంఎం మధుసూధన్‌రెడ్డి, సీఓలు, ఆర్పీలు పాల్గొన్నారు. మదనపల్లె మండలం ఈశ్వరమ్మకాలనీ గ్రామపంచాయతీలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం డస్ట్‌బిన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తాజ్‌మస్రూర్, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దమండ్యం : ప్లాస్టిక్ వినియోగంతో ప్రమాదం పొంచి ఉందని తహసీల్దార్ సయ్యద్ అహ్మద్ అన్నారు. స్థానిక బస్టాండు కూడలిలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర -స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి అధికారులు ప్లకార్డులు పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చంద్రశేఖరరెడ్డి, ఎంపీడీవో శ్రీధర్‌రావు, ఏఈ అశోక్‌కుమార్, గ్రామ సర్పంచ్ సోదనపల్లె బాషా, కార్యదర్శి సుబ్రమణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కలకడ : కె.బాటవారిపల్లెలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి విద్యార్థులతో కలిసి చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై కలకడ వరకూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి రవిచంద్రబాబు, ఎంపీడీఓ అబ్దుల్‌రహీం, సర్పంచ్ ప్యారీజాన్, విశ్వనాథ, జావద్‌అల్లీ, పంచాయతీ కార్యదర్శి దేవేంద్ర, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.